కథానిక

# ముత్యాలరావుకు సత్కారం

ఓగేటి శివరామకృష్ణ

ముత్యాలరావు తరగతిలో పాఠం చెబుతూంటే ఒక లావుగావుండే బుంగమీసాలాయన వచ్చాడు. నోట్లో చుట్టయినా తీయకుండానే "నువ్వేనా మా అబ్బాయి తరగతికి పాఠాలు చెబుతూంట?"- అని ప్రశ్నించాడు. ముత్యాలరావుకు ముచ్చమటలు పోశాయి. ఎంతో సన్నిహితుడైనా తన్ను "ఏమయ్యా"- అని పిలవడు. కనీసం ముఖం పరిచయంగూడా లేని యీ వ్యక్తి తన్ను "ఏమయ్యా?" అంటే హృదయం ఉడకిపోదూ!

ముత్యాలరావు కనీసం యోచించి జవాబు చెప్పేవీలయినా లేకపోయింది. ఆయన ఆ మాట అనటం తడవుగా- యేమీ సందేహించకుండా "ఎవరయ్యా నువ్వు ..నీ అబ్బాయి యెవడు?"-అని అన్నాడు. ఆయన సంబోధనకు తగిన సమాధానమే అది. అయితే అవతల వ్యక్తి కళ్ళు యెర్రచేస్తూ ముత్యాలరావు వైపు చూశాడు. కొట్టవచ్చినట్లుగా ఉన్నాయి, ఆ చూపులు! ముత్యాలరావు కాళ్లు ఒణికి పోతున్నాయ్. ఈ సంగతి పిల్లలు గ్రహించినట్లయితే పకపక నవ్వుతారన్న సంగతి మాత్రం అతనికి జ్ఞప్తి ఉంది. అయినా నోరు జారిన తర్వాత ఖంగారుపడితే మాత్రం ఏం ప్రయోజనం?" ముత్యాలరావే తిరిగి సంభాషణకు సంక్రమించాడు! "మీ అబ్బాయి పేరు?"- ఈసారి అతడు సంబోధించినది "మీరు"తో. తననుండయినా అవతల వ్యక్తి నేర్చుకొంటాడని అతని ఉద్దేశం! ఆవ్యక్తి పొట్టలో అక్షరం ముక్క లేని మోటుమనిషి అన్న సంగతి అతనికేం తెల్సు?

ఇక్కడంత రాద్ధాంత సిద్ధాంతాలు జరుగుతూండినా, ఆ కుఱ్ఱవాడు మాత్రం లేవలేదు. విచిత్రంగా అందరి పిల్లలతోటి చూస్తూండిపోయాడు. అంతే! ఎటొచ్చీ తికమకలు పడి బాధపడ్డది ముత్యాలరావే?

"ఆ...మావోడ్ని యెరగవటయ్యా? వెంకట్రావు. నీతరగతే చదువుతున్నాడుటగా?"

"వెంకట్రావు"- అనటంతోనే ముత్యాలరావుకు తెలిసి వచ్చింది. వెంకట్రావంటే అతని నిఘంటువులో అగ్గం - రౌడీ అని. యీ యోధుడు వాడి తండ్రన్న మాట.

తనకు తాను "మీరు" అని సంబోధించుతున్నప్పటికీ, అవతల వ్యక్తి తనను నువ్వు అనటం ముత్యాలగావుకు యిష్టంలేదు. పోనీ అవతల వ్యక్తి పెద్దవాడని సరిపెట్టుకొందామా అంటే కుర్ర వెధవలు ఊరుకోరుగదా! వీలు వెంట తన్నుగూడా "ఏమయ్యా, ఏమిటయ్యా!" అని సంబోధించవచ్చు. తాను గౌరవం చేయగా చేయగా అవతల వ్యక్తిదాకి రాడా అని ముత్యాలగావు ఉద్దేశం.

అందువల్ల అతడు తిరిగి "ఓహో మీరు వెంకట్రావు తండ్రిగారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును తెలిసి వచ్చిందిటయ్యా" అన్నాడాయన మూతి మీసాలు పైకి త్రిప్పుకొంటూ.

"ఆఁ. ఆఁ. పాపం బయట నిలబడేవున్నారు. ఈలా తరగతిలోనికొచ్చి కూర్చోండి. పెద్దలు"

"అలాగే లేవయ్యా. నీతో ఓ పెద్ద విషయం మాటాడదామని వచ్చాను."

ముత్యాలరావుకు గుండె దడ హెచ్చింది. స్వతహాగా కొత్త మనుష్యులతో మాట్లాడటమే అతనికి భయం. అందులోనూ యెన్నడూ కనీసం ముఖపరిచయం అయినా లేని వ్యక్తి తన్ను పైవిధంగా సంబోధనచేస్తూ అగౌరవపరుస్తూ "నీతో ఓ పెద్ద విషయం మాట్లాడాలనేసరికి" మరింత హెచ్చింది.

బిగపట్టుకొని అన్నాడు: "ఏమిటో మాట్లాడండి ఫరవాలేదు. ఈలా యీ బల్లమీద కూర్చోండి అని.

వచ్చిన వ్యక్తి బల్లమీద కూర్చుని ముత్యాలరావు వైపు కోరచూపులుచూస్తూ అన్నాడు:

"నువ్వేమయినా ప్రైవేటులు చెప్తున్నావుటయ్యా?"

ఇదేం ప్రశ్న? ముత్యాలరావుకు భయం వేసింది. చెబుతున్నానంటే ఏం కొంప మునుగుతుందో, చెప్పటం లేదంటే ఏం కొంప మునుగుతుందో? అతడు సందిగ్ధావస్థలో పడ్డాడు.

అవతలవ్యక్తే తిరిగి 'ఏంలేదయ్యా, మా వెంకట్రావుకు కూడా చెబుతావేమోనని. పోయిన పరీక్షల్లో మార్కులేంరాలేదుటగా.' అన్నాడు.

వెంకట్రావులాంటి రౌడీకి, మొద్దుకు, చదువు చెప్పేకంటే, జంతువులకు చెబితేనయం. ఆ సంగతి ముత్యాలరావుకు తెలుసు. గత పరీక్షలో అన్నీ ఒకట్లస్థానాన్ని మించి పోలేదు.

కొంచెందూరం యోచించి జవాబుచెప్పాడు ముత్యాలరావు: 'ప్రస్తుతం నాకు తీరికలేదండీ.' అని.

"చాలామందికిచెబుతున్నావుటకదయ్యా?"

'అయ్యా' – ఇంకా ఆయన వదలలేదు!

'ఏదో ఇన్స్పెక్టరు, నాయుడుగారూ, వగైరాలు బలవంతపరుస్తే చెబుతున్నాను. నాకు ప్రస్తుతం చెప్పటానికి తీరుబడిలేదు.'

"అలాంటి మొఖమాటమే యిదీ అనుకో! తగిన విధంగా సత్కరిస్తానులే."

"అసలు ఫలితం కన్పిస్తే-గదా" అని అనుకొన్నాడు ముత్యాలరావు. అతడి దృష్టిలో రోడ్డుమీద రాయికి చదువు చెబితే ఎంతో వెంకట్రావుకు చెబితే అంత.

"నన్ను బలవంతపెట్టకండి."

"నీకేం కావాలంటే అది యిస్తాను. మా కుర్రాడికి చదువు చెప్పితీరాలి" రాజు శాసించిన విధంగా అన్నాడాయన.

"నన్ను బలవంతపెట్టకండి అయ్యా" అన్నాడు ముత్యాలరావు.

"నీ కెంత కావాలంటే అంతయిస్తాను. కుర్రవాడిని నీ దగ్గర ఉంచుకోవాలి."

మరి తప్పించుకొనటానికి దారిలేకపోయింది.

"నాదగ్గర చాలా కొద్దిమంది పిల్లలున్నారు. కష్టపడి చెప్పేవరకే నా పూచీ. అల్లరిచిల్లరి వేషాలు వేసినా, సక్రమంగా నడుచుకోకపోయినా, నే పంపివేయవలసి వస్తుంది. కష్టపడి చెప్పేవరకే నా బాధ్యత. చదువుకొని, పరీక్షల్లో, మార్కులు సంపాదించుకొనటం వాళ్ళ బాధ్యత."– అని పారం వప్పచెప్పాడు ముత్యాలరావు.

"కానియ్యవయ్యా! దానికేమిటి, నీ యిష్ట మొచ్చినట్లు చెయ్యి. నీకు కావలసిన సొమ్ము స్తాను వాణ్ణి పైక్లాసులో వేయటమే నాకు కావలసింది."

"పరీక్షకు కూర్చోబెట్టేవరకే నా బాధ్యత. కానీండి-తరువాత నాకేం సంబంధం లేదు సుమండీ!" అన్నాడు ముత్యాలరావు.

"అలాగే కానియ్యవయ్యా!" అంటూ నవ్వుకొంటూ వెళ్ళిపోయాడాయన.

ముత్యాలరావు అదృష్టంవల్ల తరగతిలో యే వొక్కరూ అల్లరి మాత్రం చెయ్యలేదు. ఈ సంభాషణతో బయట గంటకూడా మ్రోగింది. ముత్యాలరావు మరో తరగతికి వెళ్ళాడు.

వెంకట్రావుకు చదువుచెప్పటానికి ముత్యాలరావు చాలా భయపడ్డాడు. అసలు రహస్యమేమంటే, వెంకట్రావుకు తన వయస్సు లేకపోయినా, శరీరపుష్టి గలవాడు. వెంకట్రావూ, ముత్యాలరావూ, కుస్తీ పట్టినట్లయితే వెంకట్రావు నెగ్గటం తథ్యం!

తండ్రిగారిచ్చిన తరిఫీదు ఫలితమో మరేమో గాని వెంకట్రావు మాత్రం ప్రయివేటుకు పోయివస్తూండేవాడు. వినేవి వింటూండేవాడు మానేవి మానేస్తూండేవాడు. ఎక్కువ కాలం ఉండవద్దని చెప్పటానికి కాని, వెళ్ళిపోవలసిదని చెప్పటానికి కాని, ముత్యాలరావుకు ధైర్యం సరిపోయేదికాదు. ప్రయివేట్లు మాత్రం జరిగిపోతూండేవి!

వెంకట్రావు అందరి విద్యార్థుల కంటె ముందుగా ప్రయివేటు డబ్బు తెచ్చి ముత్యాలరావుకు అందించుతూండేవాడు. దానికి అతడు వెంకట్రావును అభినందించేవాడు.

మధ్యమధ్య కాయలూ, పండ్లూ తెచ్చి యిచ్చేవాడు ముత్యాలరావుకు.

"ఎక్కడివోయ్. యివన్నీ" అని అడగటం తరువాయిగా మా తోటలో పండినాయనో, మా చుట్టాలు తెచ్చారనో యేమో ప్రత్యు

త్తరం యిచ్చేవాడు వెంకట్రావు.

"ఎందుకోయ్"- అని ఒకటి రెండు మార్లు త్రిప్పి పంపప్రయత్నించాడు ముత్యాలరావు.

కాని వెంకట్రావు తండ్రి త్రిప్పి పంపి పుచ్చుకోవలసిందని కబురు పంపేవాడు. ముత్యాలరావుకు పుచ్చుకోటం తప్పని సరి అయ్యేది.

వెంకట్రావు తండ్రిని ఒక చదువురాని వ్యక్తిక్రింద, జమచేశాడు గాని, మరోవిధంగా యోచనమాత్రం చెయ్యలేదు.

అయితే కొద్ది కాలం తర్వాత మాత్రం తెలిసింది. ఆయనగూడా బోర్డుమెంబరే అయినట్లు! ఆ సంగతి తెలిసీ తెలియటంతోటే, ముత్యాలరావుకు ఖంగారు కలిగింది. తానేమో తప్పు చేసినట్టు బాధపడ్డాడు.

ఇకమీద పైవ్యక్తి కనిపించినప్పుడల్లా 'నమస్కారం' చేయటం, కాని సంభాషణ సాగించటం జరిపేవాడు!

స్వతహాగా ముత్యాలరావు కష్టపడి చెప్పేవాడని చెప్పకతప్పదు. ఫలానా మెంబరుగారి కుమారుడన్న సంగతి తెలిసినప్పటి నుంచి, వెంకట్రావుకు మరింత శ్రద్ధతో చదువు చెప్పటం సాగించాడు.

సంవత్సరాంతం పరీక్షల్లో ముత్యాలరావు వద్ద ప్రయివేటు చదువుకొన్న విద్యార్థుల్లో ఒక్క వెంకట్రావే ఫెయిలయ్యాడు. ముత్యాలరావు కష్టపడి చెప్పిన ఫలితంగా అతడి సబ్జక్టులలో కృతార్థుడయ్యాడు.

ఆ సంగతి వెంకట్రావు తండ్రికేం తెల్సు! ముత్యాలరావుమీద కత్తికట్టాడు! అంతే. తిరిగి వేసవి సెలవుల తర్వాత, స్కూళ్లు తెరచిన నెల తిరగకుండానే- మరో ఊరు బదిలీ చేయించాడు ముత్యాలరావును. "స్వలాభాపేక్షకులు వీరే" ననుకొంటూ- కాకులుదూరని, చీమలు దూరని ఆ గ్రామానికి బయలుదేరాడు ముత్యాలరావు.

---

స్కెచ్

# ఇంతింతి సత్యభామ

మేడూరి రామకృష్ణ

ఆ రోజు కాలేజి వొదిలెయ్యగానే ఇంటర్మీడియెట్ వాళ్ళు "పురుషుడికి స్త్రీకి సమాన హక్కుల" సమస్యమీద డిబేట్‌కి అసలు నిర్దేశించబడిన అధ్యక్షుడు హాజరవక పోవడంవల్ల, నేను కుర్చీలో కూర్చోనిదే వొదల్లేదు. వాళ్ళ అర్థరహిత విమర్శలకీ, కేకలకీ, మీటింగు పూర్తయ్యేటప్పటికి బాగా ఆలస్యం అవటం వల్ల, నాకు బాగా తలనొప్పి వొచ్చింది. ఇంటి ముఖం పట్టేసరికి బాగా చీకటి పడిపోయింది. మా ఇంటి అరుగుమీద ముగ్గురో నలుగురో అమ్మలక్కలు నుంచుని ఏదో గట్టిగామాట్లాడుకుంటున్నారు. గత్యంతరం లేక, సందుగుండా నడిచి దొడ్డిదారిన వెళ్ళాల్సొచ్చింది ఇంట్లోకి. పెంకులెగిరిపోయేట్టు సుబ్బులూ, ఆవిడకి వెనకపాటలాగా ఆదెవొరసని 'అమ్మాజీ', ఓమూల కళ్లు నులుపుకుంటూ 'నాగూ' ఒకటే ఏడుపు. నిమిషానికో స్థాయిలోకి హెచ్చుతూ, మధ్య మధ్య సాహిత్యంతో కూడుకుని ఉన్న ఆ ఏడుపు దగ్గరౌతున్నకొద్దీ నాకు సందేహాలు ఎక్కువై వొణికే కాళ్ళతో లోపల ప్రవేశించా. మా ఆఖరుపిల్ల 'అమ్మాజీ' నన్ను చూడగానే 'నాన్నా' అంటూ వొచ్చి గట్టిగా నన్నుపట్టుకుని ఏడ్చింది. నాకేం అర్థంకాలేదు. మళ్లీ అంతా చక్కగా తెల్లటిబట్టలు వేసుకున్నారు. తలలు దువ్వుకుని ముస్తాబై మరీఏడుస్తున్నారు.

ఇటువంటి సమయాల్లో సుబ్బుల్ని పలకరించేందుకు నాకు ధైర్యం చాలదు. ఆవిడ పిల్లల్తో చేరి అల్లరి మొదలెట్టినా, ఏడుపు సాగించినా ఒక అంతకు ఆగదు. ఓదార్చిన కొద్దీ ఎక్కువవుతుంది కాని తగ్గదు. ఎంత ప్రయత్నించినా కారణం కనుపించదు. పరువూ, దిండ్లూ మా ఆవిడ కన్నీటితో తడిసిపోతూన్నాయ్. నా సైకాలజీ గ్రూపూ, రెండు వందలు సంపాదించిపెట్టే నా ప్రొఫెసర్ ఉద్యోగం వ్యర్థం అనిపించాయి. ఎక్కడీ